క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 5, 16వ వార్డుల్లో నీరు నిల్వఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయించి, అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, జనగామ రత్నమాల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పనులను పూర్తి చేయాలి

హుస్నాబాద్: పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే పూర్తి చేయించి లబ్ధిదారులకు అందజేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం లబ్ధిదారులతో కలిసి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. మధ్యలోనే మిగిలిన ఇళ్లు ఆగిపోవడంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్

చేర్యాల(సిద్దిపేట): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రెండు రోజుల్లోనే కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం ఎంఈఓ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ విషయమై ఫోన్‌లో మాట్లాడగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిన ఎంఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ కేంద్రంలో కనీస అనుమతులు కూడా లేకుండా నడుస్తున్న కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

రక్తదాన శిబిరం

సిద్దిపేటకమాన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, హౌస్ సర్జన్స్, స్వచ్ఛంద రక్త దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, డాక్టర్ రాంమోహన్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ

సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ తడి, పొడి చెత్త వేరు చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ జరగడం లేదు. చెత్తను పట్టణ శివారులోని కుంటలు, బావుల్లో పడేయడంతో ప్రజలు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు చెత్తకు నిప్పు పెట్టడంతో వెలువడే వాయు కాలుష్యంతో రాకపోకలు సాగించేవారు, సమీప కాలనీ వాసులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- ప్రచారాలతోనే కాలం వెళ్లబుచ్చుతున్న వైనం
- పట్టణ శివారు కుంటలు, బావుల్లో డంపింగ్
- కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు
- కమిషనర్ లేక కుంటుపడ్డ పాలన



నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

చేర్యాల(సిద్దిపేట): దేశ వ్యాప్తంగా మున్సిపాలిటీలు తడి, పొడి చెత్త వేరుచేసి కంపోస్టు ఎరువు, బయోగ్యాస్‌ను తయారు చేస్తూ అవార్డులు పొందుతుంటే చేర్యాల మున్సిపాలిటీలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. సేకరించిన చెత్త నుంచి తడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువుగా మార్చడంతో పాటు, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయం సమకూర్చుకోవచ్చు. కానీ అది జరగడం లేదు. పట్టణంలో 20 వేల పైచిలుకు జనాభా ఉంది. 12 వార్డులు ఉన్నాయి. పట్టణ పరిధిలో చెత్త సేకరణకు రెండు ట్రాక్టర్లు, ఆరు ట్రాలీ ఆటోలు ఉండగా రెండు వార్డులకు ఒక వాహనం చొప్పున చెత్త సేకరిస్తున్నారు.

నిరుపయోగంగానే బుట్టల పంపిణీ

తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త బండికి ఇవ్వాలంటూ రెండు రకాల బుట్టలు పంపిణీ చేసిన యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో లక్ష్యం నీరిగారిపోయింది. నిర్వహణ లేమి కారణంగా చెత్త వేర్వేరుగా సేకరణ జరగడం లేదు. తడి, పొడి చెత్త వేరు చేసి తరలించాలనే ఉద్దేశంతో అధికారులు వార్డుల వారీగా అవగాహన కల్పించారు. మొదట్లో పట్టణ వాసులు చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి ఇచ్చినా మున్సిపల్ సిబ్బంది కలగలిపి ఒకే వాహనంలో తరలిస్తుండడంతో పట్టణ ప్రజలు వేర్వేరుగా నిల్వ చేయడం మానేశారు. చెత్త సేకరణ వాహనాల్లో సిబ్బంది అన్ని రకాల చెత్తను కలిపి సేకరిస్తుండటంతో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు.

బావుల్లో చెత్త డంపింగ్

పట్టణ పరిధిలోని 12 వార్డుల్లో సేకరిస్తున్న చెత్తను వాహనాల ద్వారా పట్టణ శివారుల్లోని పాడుబడ్డ బావులు, కుంటల్లో డంప్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల సమీప ప్రజలు కాలుష్యంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇది ఇలా ఉంటే వర్షాకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా డంప్ చేసిన చెత్త నుంచి వెలువడే కాలుష్యం, చెత్త డంపింగ్ ప్రాంతంలో దోమల బెడద, పందుల సంచారంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా డీఆర్సీ కేంద్రం

పట్టణ కేంద్రంలో సేకరించిన చెత్త నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్త నుంచి కంపోస్టు



తడి, పొడి చెత్తను ఒకటిగా సేకరిస్తున్న సిబ్బంది

ఎరువు, పొడిచెత్తను రీసైక్లింగ్ కోసం పంపేందుకుగాను డంపింగ్ యార్డులో డీఆర్సీ సెంటర్ నిర్మాణం చేపట్టారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన డంపింగ్ యార్డు నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడం, అక్కడే చేపట్టిన డీఆర్సీ పనులు అసంపూర్తిగా ఉండటంతో తడి, పొడిచెత్త వేరుచేసే కార్యక్రమం ఆచరణకు నోచుకోలేదు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం. అలాగే తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా ప్రణాళికలు రూపొందిస్తాం. మళ్లీ ఒకసారి వార్డుల వారీగా ప్రజలకు అవగాహన కల్పించి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి తరలిస్తాం.

– జి.నర్సయ్య, ఇన్‌చార్జి కమిషనర్

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

సమావేశానికి అధికారుల గైర్హాజరు



మాట్లాడుతున్న ఎంపీపీ అరుణాదేవి

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ అరుణాదేవి అధ్యక్షతన జరిగిన చివరి సమావేశానికి గ్రామ స్పెషలాఫీర్లు, మండల స్థాయి అధికారులు గైర్హాజరుపై ఎంపీటీసీలు మండిపడ్డారు. సమావేశం ప్రారంభం కాగానే పలువురు ఏఈఓలు మాట్లాడారు. రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. హరితహారంలో విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ఏఈ మారుతి సభ దృష్టికి తెచ్చారు. నర్మేట లోని బీసీ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించినా నీటిని సరఫరా చేయడంలేదని ఎంపీటీసీ బాబు అధికారులను నిలదీశాడు. ఈ విషయంపై ఎంపీపీ అరుణాదేవి మాట్లాడుతూ సభ్యులు సభలో ప్రస్తావించిన సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. రైతుబంధు డబ్బులు విడుదల చేయడంతో పాటు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ఉమ, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేణుక, ఎంపీడీఓ వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పలు తీర్మానాలు

- ఆమోదించిన సభ్యులు
- చైర్‌పర్సన్ అధ్యక్షతన సమావేశం



సమావేశంలో తీర్మానాలను చదివి వినిపిస్తున్న మేనేజర్ ప్రభాకర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పట్టణ సమస్యలపై చర్చించిన సభ్యులు పలు అంశాలకు సంబంధించి తీర్మానం చేశారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ, వాహనాల మరమ్మతులు, నీటి సరఫరా లైన్ల మరమ్మతులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల చెల్లింపు, పత్రికా ప్రకటనల బిల్లుల చెల్లింపులు, నివాస యోగ్యమైన ప్లాట్లని వ్యాపార యోగ్యంగా మార్చుటకు అనుమతించుట తదితర అంశాలపై తీర్మానం చేశారు. అలాగే 2024–25 బడ్జెట్‌లో కొన్ని అంశాలు డిమాండ్ నోటీసుల ప్రింటింగ్‌కు అనుమతి, సీసీ రోడ్లు, సీసీ కల్వర్టులు, సీసీ డ్రైన్ల మరమ్మతు అనుమతులు, బతుకమ్మ చెరువు దగ్గర మరమ్మతులకు అనుమతి తీసుకోవడం వంటి వాటికి ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసినట్లు కమిషనర్ జి.నర్సయ్య తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, జుబేదా ఖతూన్, ఉడుముల ఇన్నమ్మ, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీష్, కోఆప్షన్ సభ్యులు ఆరోగ్యరెడ్డి, అంజనాదేవి, జేబా బేగం, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఏఈ తబ్రీజ్ పాల్గొన్నారు.

సర్కార్ బడిలో నాణ్యమైన విద్య

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అలిరాజ్‌పేటలో మూడేళ్ల క్రితం మూతపడిన ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ప్రారంభించారు. కరోనా సమయంలో పిల్లలు రాకపోవడంతో పాఠశాలను మూతవేశారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వ ఆదేశాల పాఠశాలను పునః ప్రారంభించినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ రమ్య, సీఆర్‌పీ దయానంద్, నాయకులు పాల్గొన్నారు.

టీసీ అడిగితే..

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు పైచదువుల కోసం టీసీ అడిగితే డబ్బులు ఇవ్వందే టీసీ ఇవ్వడం కుదరదంటూ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ముప్పుతిప్పలు పెడుతున్నారని మిరుదొడ్డికి చెందిన ఓ విద్యార్థి తండ్రి ఎల్కుల మారుతి ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం ఎంఈఓకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా అయన మాట్లాడాడు. మిరుదొడ్డిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో చదువుతున్న తన కుమారుడిని మరో స్కూల్‌లో చేర్పించడానికి టీసీ, బోనఫైడ్ అడిగితే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించాడు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ మిరుదొడ్డి ఎంఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎంఈఓ జోగు ప్రభుదాసును వివరణ కోరగా విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రైవేట్ స్కూల్‌పై విచారణ జరుపుతామన్నారు.

మల్లికార్జున్‌కు డాక్టరేట్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేటకు చెందిన పంజా మల్లికార్జున్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ఆర్ట్స్ కళాశాలలో ఫిలాసఫీలో అండర్ స్టాండింగ్ స్పిరిచ్యువల్ టెక్నిక్స్ ఆఫ్ ఓషో రజనీస్ అంశంపై ప్రొఫెసర్ వంశీధర్ ఆధ్వర్యంలో పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పొందాడు. తనకు సహకరించిన గైడ్ ప్రొఫెసర్, మిత్రులు, స్కాలర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రైతుకు గాయాలు



దుబ్బాకటౌన్: విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్‌కు చెందిన రైతు గుండెకాయ రమేశ్ పొలం పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగలడంతో కుడిచేతికి తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకొని గాయపడ్డ రమేష్‌కు ప్రథమ చికిత్స చేసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యా సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన జరిగే విద్యా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ర్యాకం మల్లేశం, గూడూరు శివాజీ పిలుపునిచ్చారు. అక్బర్ పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యా సదస్సు కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సులో 'సంక్షేమంలో సామాజిక విలువలు' అన్న అంశంపై ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, 'విద్యారంగ సంక్షోభం-కర్తవ్యాలు' అన్న అంశంపై టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఆట-మాట-పాట అంశంపై అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క ప్రసంగిస్తారని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగులు, మేధావులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూంపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రాజేందర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు అందె రామచంద్రం, భాగ్యమ్మ, దయాసాగర్, వినయ్, ప్రకాష్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్మేట ఉన్నత పాఠశాలలో..

నంగునూరు(సిద్దిపేట): టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే విద్యా సదస్సుకు ఉపాధ్యాయులు పెద్ద హాజరుకావాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి శనిగరం కనకయ్య, కార్యవర్గ సభ్యుడు పొన్నమల రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం నర్మేట ఉన్నత పాఠశాలలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సందర్శిని మాసపత్రిక సంపాదకుడు ప్రకాష్‌రావు ఉద్యోగ విరమణ పురస్కరించుకొని గజ్వేల్ లోని మహింతి ఆడిటోరియంలో విద్యా సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరికృష్ణ, జోన్ కన్వీనర్ సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్ రవి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ, మిషన్ భగీరథ సర్వేలు



మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీ పనులు, మిషన్ భగీరథ నల్లాల సర్వేలు శుక్రవారం ఉమ్మడి మద్దూరు మండలంలో అధికారులు నిర్వహించారు. లింగాపూర్, జాలపల్లి గ్రామాల్లో వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఓ ఖాజామైనుద్దీన్, గ్రామ పంచాయతీల కార్యదర్శులు రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేలం పాటలు వాయిదా

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన కూరగాయలు, పశువుల వారసంత వేలం పాటలు వాయిదా పడినట్లు కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన వాటి కంటె తక్కువ ధరకు వేలం పాడినందున శనివారం మళ్లీ నిర్వహిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పార్కింగ్ పరేషాన్

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను ప్రజలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. వాహనాల అస్తవ్యస్త పార్కింగ్‌తో కార్యాలయాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ కెరీర్ గైడెన్స్ పుస్తకాల పంపిణీ

నంగునూరు(సిద్దిపేట): కెరీర్ గైడెన్స్ పుస్తకంతో విద్యార్థులు తమ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునే అవకాశం ఏర్పడుతుందని ఇన్‌చార్జి ఎంఈఓ యాదవరెడ్డి అన్నారు. 9, 10 తరగతి విద్యార్థులకు ఉపయోగపడే కెరీర్ గైడెన్స్ పుస్తకాలను శుక్రవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, మోహన్‌బాబు, రజిత, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా బంద్

వర్గల్(గజ్వేల్): వర్గల్ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు మల్లారెడ్డిపల్లి, గుంటిపల్లి, శేరిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పట్టణంలోని పలుచోట్ల..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 33/11 కేవీ ముస్తాబాద్ చౌరస్తా సబ్‌స్టేషన్, 11 కేవీ రాఘవేంద్రనగర్, 11 కేవీ గాడిచెర్లపల్లి ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాఘవేంద్రనగర్, కళ్లకుంట కాలనీ, ఇందిరానగర్, లలితానగర్, వడ్డెరకాలనీ, ఎల్లారెడ్డినగర్, హరీశ్‌రావునగర్, గాడిచెర్లపల్లి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ ఇసుక అక్రమ రవాణాపై కేసు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో ఇసుక అక్రమ రవాణాపై బెజ్జంకి ఎస్‌ఐ కృష్ణారెడ్డి కొరడా ఝులిపించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తోటపల్లి శివారు మోయతుమ్మెద వాగు వద్ద జేసీబీతో శుక్రవారం కాల్వ తవ్వించారు. ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, గుట్కాలు, గంజాయి రవాణాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

◆ అంటువ్యాధులపై అవగాహన

బెజ్జంకి(సిద్దిపేట): అంటువ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు రక్షణ కప్స్ ఉపయోగపడతాయని బాలవికాస ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వసంత పేర్కొన్నారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో గల ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో అంటువ్యాధుల నివారణ కోసం మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు.

◆ ఘనంగా కుటుంబమిషన్ దినోత్సవం

బెజ్జంకి(సిద్దిపేట): జాతీయ కుటుంబమిషన్ దినోత్సవాన్ని శుక్రవారం బెజ్జంకిలో ఘనంగా నిర్వహించారు. బెజ్జంకిలో 40 ఏళ్లుగా దర్జీ పని చేస్తున్న శీలం సత్తయ్యను సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల ప్రతినిధి శ్రీధర్, నాయకులు గుబిరె మల్లేశం, ఐలేని నర్సింహారెడ్డి, బండి రమేష్, బొనగం లక్ష్మీనారాయణ, కల్లూరి రవి, బొనగం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ముత్యాల తలంబ్రాల అందజేత

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలు పొందడం సంతోషంగా ఉందని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు భద్రాచలం నుంచి తెచ్చిన ముత్యాల తలంబ్రాలను శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భద్రాచల ముత్యాల తలంబ్రాలు పొందడమంటే సీతారాముల ఆశీస్సులు లభించినట్లేనన్నారు.

◆ అవకతవకలపై ప్రశ్నించాలి

హుస్నాబాద్: మున్సిపాలిటీలో ఎన్ని అవకతవకలు జరిగినా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రశ్నించకుండా మౌనం వహించడం సరికాదని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో దొంగ ఇంటి బిల్లులు, ఇల్లు లేకున్న ఇంటి నంబర్లు, సంబంధం లేని భూములకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించాడు. అక్రమ ఇంటి నంబర్ల ప్రొసీడింగ్‌లో కమిషనర్ సంతకం పెట్టాడా, లేకపోతే ఫోర్జరీ చేశారో మున్సిపాలిటీలో ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల టీఎస్‌ఎంఎస్‌లో(మోడల్‌స్కూల్) జూనియర్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంటల ప్రాతిపాదికన బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ అర్హత కలిగిన వారు ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, అదే రోజు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

◆ ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకుడు పుల్లూరు ఉమేష్ శుక్రవారం డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని పాఠశాలలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

◆ మోకుదెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవీందర్ గౌడ్

హుస్నాబాద్: సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన చీకట్ల రవీందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరాస్వామి గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.

బదిలీలతో పాఠశాలలు బలోపేతం

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



వర్గల్‌లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నంగునూరు(సిద్దిపేట): ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తికాగానే ఆయా సబ్జెక్ట్ టీచర్లు రావడం వల్ల పాఠశాలలు బలోపేతమవుతాయని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలమాకుల ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉందని, ప్రస్తుతం బదిలీ ప్రక్రియ ప్రారంభమవుతున్నందున లాంగ్వేజ్, సబ్జెక్ టీచర్లు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఆకునూరు ఎంపీపీఎస్‌లో...

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు ఎంపీపీఎస్‌లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కర్రోల్ల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఐలయ్య విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం మాజీ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ మండల నాయకుడు జంగిటి భిక్షపతి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, బీజేఆర్‌యూత్ నాయకుడు శ్రీనివాస్ పలకలు అందించారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలల్లో ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పాయపల్లి ప్రాథమిక పాఠశాలో..

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని దౌల్తాబాద్ మండలం అప్పాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మల్లేశం, అశోక్, గణేష్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

వర్గల్ ప్రాథమిక పాఠశాలలో..

వర్గల్(గజ్వేల్): బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వర్గల్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం జరిపించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌గౌడ్, హెచ్‌ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా..

కొముురవెల్లి(సిద్దిపేట): బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో కలసి ప్రాధానోపాధ్యాయులు సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు..

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన బడిబాటలో భాగంగా శుక్రవారం కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బడీడు పిల్లలందరు బడిలో ఉండేలా చూసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు.

రామంచలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ, పెద్దకోడూరు, చౌడారం, మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు రాములు, సురేష్ కుమార్, సునీత, దేవకి తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో..

మద్దూరు(హుస్నాబాద్): బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. మద్దూరు మండల పరిధి వల్లంపట్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతిలో చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలభాస్కర్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.